
జిత్తులమారి నారా



మాచర్ల/గురజాల : జిత్తులమారి బాబు మోసాలకు ప్రజలు మరోమారు దగా పడ్డారు. ముఖ్యమంత్రి కావటం కోసం ఎన్నికల ముందు జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌తో కలిసి సూపర్ సిక్స్ హామీలతో ఊదరగొట్టిన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు వంద రోజులైనా వాటి అమలుపై దృష్టిపెట్టలేదు. పైగా రాష్ట్ర పరిస్థితి బాగోలేదంటూ బీదార్పులు ఆరుస్తున్నారు. ఫలితంగా ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మాచర్ల నియోజకవర్గంలో సర్కారు పనితీరుపై నిరసన వ్యక్తమవుతోంది. మాజీ సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన ప్రతి హామీనీ కచ్చితంగా అమలు చేసి చూపించారని ప్రజలు గుర్తుచేసుకుంటున్నారు. ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు, పవన్ కళ్యాణ్ ప్రతి సభలోనూ సూపర్‌సిక్స్‌పై ఊదరగొట్టారని, ఇప్పుడు అధికారం చేపట్టాక అమలు ఊసే మరిచారని పలువురు రాజకీయ విశ్లేషకులూ పెదవి విరుస్తున్నారు. అసెంబ్లీ సాక్షిగా స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూపర్ సిక్స్ హామీలను చూస్తుంటే భయమేస్తోందని అనడంపైనా ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఎన్నికల ముందు ఒక మాట.. అధికారంలోకి వచ్చాక మరో మాట మాట్లాడటం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. అసలు సూపర్ సిక్స్ హామీలు అమలవుతాయా లేదా అనే దానిపై ఎమ్మెల్యేలను నిలదీసేందుకు సిద్ధమవుతున్నారు. చంద్రబాబు ప్రతిసారీ ప్రజలను మోసం చేస్తున్నారని, అధికారంలోకి వచ్చేదాక ఒక మాట, వచ్చాక మరోమాట చెబుతున్నారని విమర్శిస్తున్నారు. చంద్రబాబుకు డెప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కూడా వంత పాడడంపైనా ఆగ్రహం వ్యక్తమవుతోంది.

• సూపర్ సిక్స్ హామీల అమలేదీ? • ప్రశ్నిస్తున్న ప్రజలు • తక్షణ అమలుకు డిమాండ్



ప్రతి మహిళకు నెలకు రూ.1,500


నియోజకవర్గాలవారీగా అర్హులు

గురజాల	1,23,468
మాచర్ల	74,626

నెలకు ఇవ్వాల్సిన సాయం రూ.29.71 కోట్లు

జగన్ పాలనలో ఐదేళ్లలో రైతులకు అందిన సాయం

పథకం	నియోజకవర్గం	లబ్ధి (రూ.కోట్లలో)
రైతు భరోసా	గురజాల	204.00
	మాచర్ల	205.70



టీడీపీ పాలనలో ఒక్కో ఏడాదికి రైతులకు అందాల్సిన సాయం

నియోజకవర్గాలవారీగా అర్హులు

గురజాల	42,202
మాచర్ల	46,422
ఇవ్వాల్సిన సాయం	రూ.177.24 కోట్లు

జగన్ పాలనలో ఐదేళ్లలో తల్లికి అందిన సాయం

పథకం	నియోజకవర్గం	లబ్ధి (రూ.కోట్లలో)
అమ్మ ఒడి	గురజాల	155.00
	మాచర్ల	183.13



టీడీపీ పాలనలో ఒక్కో ఏడాదికి తల్లికి అందాల్సిన సాయం

నియోజకవర్గాలవారీగా అర్హులు

గురజాల	51,551
మాచర్ల	50,613
ఇవ్వాల్సిన సాయం	రూ.153.24 కోట్లు



యువతకు నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి

నియోజకవర్గాలవారీగా అర్హులు

గురజాల..	1,22,447
మాచర్ల..	57,438

నెలకు ఇవ్వాల్సిన సాయం

సాయం రూ.60.30 కోట్లు

నిరుద్యోగ భృతి చెల్లించాలి



ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పేరిట నిరుద్యోగ భృతి నెలకు రూ.3 వేలు ఇస్తామని కూటమి నేతలు హామీ ఇచ్చారు. ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. అధికారంలోకి వచ్చి రెండు నెలలు అవుతున్నా, ఇప్పటి వరకు భృతి విషయంలో అతీగతీ లేదు. ఇచ్చిన హామీ మేరకు వెంటనే నిరుద్యోగ భృతి చెల్లించి మాట నిలుపుకోవాలి. భృతి కోసం ఎదురుచూస్తున్నాం. ఇప్పటికే ఆలస్యమైంది.

–కొమ్మాలపాటి గోపి, చిలకలూరిపేట

పెట్టుబడి సమయం వచ్చింది.. ఏది సహాయం!



ప్రతిరైతుకు పెట్టుబడి సాయం కింద ఏడాదికి రూ.20 వేలు ఇస్తామన్నారు. గత ప్రభుత్వం లో రూ.13,500 ఇస్తామని చెప్పి ప్రతి ఏడు ఇచ్చారు. ఇప్పుడు వీరు కూడా తప్పకుండా ఇవ్వాల్సిందే. వర్షాలు ముమ్మరంగా పడుతున్నాయి. పంటలు వేసే సమయం ఆసన్నమైంది. నారు, ఎరువులు కొనేందుకు కూలీలను పెట్టుకునేందు పెట్టుబడి కావాలి. వాగ్దానం చేసిన మేరకు ఇస్తే సహాయం చేసిన వారు అవుతారు.

–షేక్ సైదా, రైతు, విప్పర్ల

తల్లికి వందనం ఊసేది?



మాకు ముగ్గురు కుమార్తెలు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో అమ్మ ఒడి పథకంలో భాగంగా మా అమ్మాయి అమూల్యాకు అమ్మ ఒడి కింద ప్రతి ఏటా రూ.15 వేలు ప్రభుత్వం ఇచ్చింది. చదువుకు ఉపయోగపడింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో భాగంగా తల్లికి వందనం పథకంలో కుటుంబంలో ఎంతమంది చదువుకుంటున్న అందరికి ఏటా రూ.15 వేలు అందజేస్తామని చెప్పారు. ప్రభుత్వం ఏర్పడి నెలలు గడుస్తున్నా ఇంత వరకు తల్లికి వందనం ఊసేలేదు.

– జోగి శివమ్మ (శావల్యాపురం)

నెలకు రూ.1,500 ఇవ్వాలి



మేము వ్యవసాయ కూలీ పనులు చేస్తుంటాం. నా ఇద్దరు పిల్లలు చదువుకుంటున్నారు. ప్రతి మహిళకు నెల 1500 ఇస్తామని ఎన్నికలలో వాగ్దానం చేశారు. ఇచ్చిన మాట ప్రకారం ఇవ్వాలి. ఇప్పటికే రెండో నెల గడుస్తోంది. ప్రతి మహిళకు 1500 రూపాయల పథకం గురించి మాట్లాడం లేదు. చంద్రబాబు నాయుడు చెప్పిన విధంగా ఇస్తే ఇంటి ఖర్చులకు కొంచెం ఆసరాగా ఉంటుందని భావిస్తున్నా. త్వరగా పథకం కింద ప్రకటించిన విధంగా డబ్బులు ఇవ్వాలి.

–కె.రమ్య, యడ్లపాడు


క్లుప్తంగా

రాష్ట్ర ఖోఖో జట్టుకు ఒప్పిచర్ల విద్యార్థిని ఎంపిక



కారెంపూడి: ఖోఖో సబ్ జూనియర్ బాలికల రాష్ట్ర జట్టుకు మండలంలోని ఒప్పిచర్ల జెడ్పీ హైస్కూల్ 8వ తరగతి విద్యార్థిని పాశం శివమణి ఎంపికైనట్టు పాఠశాల హెచ్‌ఎం విజయలలిత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం కృష్ణా జిల్లా గుడివాడలో శిక్షణ పొందుతోందని, శిక్షణ అనంతరం జార్ఖండ్ రాష్ట్రంలో సెప్టెంబర్ 28 నుంచి అక్టోబర్ 2 వరకు జరగనున్న జాతీయ స్థాయి ఖోఖో పోటీలలో ఆడనున్నట్లు వెల్లడించారు. ఎంపికైన విద్యార్థినిని పాఠశాలలో బుధవారం అభినందించారు. శిక్షణ ఇచ్చిన పీడీ రత్తయ్యను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ప్రశంసించారు.

బ్రిడ్జిపై గుంతల పూడ్చివేత



కారెంపూడి: స్థానిక వినుకొండ రోడ్డులోని మంత్రాలమ్మ కనుమ వద్ద ఉన్న నాగులేరు బ్రిడ్జిపై పడిన గోతులను శ్రీచక్ర సిమెంట్స్ యాజమాన్యం ఆదేశాల మేరకు కార్మికులు బుధవారం పూడ్చారు. కాంక్రీటు కలిపి గుంతలను పూడ్చి వేశారు. గుంతల వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్న విషయం తమ దృష్టికి వచ్చిందని, అందుకే గుంతలు పూడుస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో సంస్థలోని వివిధ హోదాల అధికారులు రాజేంద్రప్రసాద్, మురళీకృష్ణ, సెక్యూరిటీ అధికారి లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

పిడుగురాళ్ల: పట్టణ సమీపంలోని కొండమోడు 220 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో అత్యవసరంగా మరమ్మతులు నిర్వహిస్తున్నందున గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ ఆరికట్ల శివనాగిరెడ్డి బుధవారం తెలిపారు. పిడుగురాళ్ల పట్టణ, జానపాడు పరిసర ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని విద్యుత్ ఏఈ కోరారు.

వివాహిత అదృశ్యంపై కేసు

గురజాల: వివాహిత అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు సీఐ పి.భాస్కర్ తెలిపారు. చర్లగుడిపాడు గ్రామానికి చెందిన వివాహిత కుటుంబ కలహాల నేపథ్యంలో తన ఇద్దరు బిడ్డలను తీసుకుని ఈనెల 16వ తేదీ అర్ధరాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్ల వద్ద విచారణ చేసినా ఫలితం లేకపోవడంతో బుధవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

రెంటచింతల: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతని ఐటీసీ అండ్ సెర్ఫ్ సీఓ మాడెబోయిన గురుమూర్తి చెప్పారు. ఐటీసీ అండ్ సెర్ఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు చేపట్టిన స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు మానవహారంగా ఏర్పడ్డారు. అనంతరం గ్రామ వీధులలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటీసీ అండ్ సెర్ఫ్ సీఓ జి.గురుమూర్తి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా చేపట్టిన ఈ స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ ఇంటి ముందు, పరిసరాలలో మొక్కలను నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ జి.అనంత కోటేశ్వరరావు, శానిటేషన్ అధికారి పాలువాయి నాగరాజు, హెచ్‌ఎం దుర్గాప్రసాద్, ఉపాధ్యాయులు, హరిత రాయబారులు పాల్గొన్నారు.



మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు

చింతపల్లిలో స్వచ్ఛతాహి సేవ

కారెంపూడి: చింతపల్లి గ్రామంలో స్వచ్ఛతాహి సేవ పక్షోత్సవాల సందర్భంగా గ్రామంలో బుధవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ముందుగా గ్రామంలో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించేందుకు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం డ్రెయినేజీలు, రోడ్ల వెంట ఉన్న చెత్త కుప్పలను తొలగించే పనులు చేపట్టారు. ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో ఈఓపీఆర్డీ సత్యప్రసాద్, ఎస్ఎంసీ సుబ్బారావు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



చింతపల్లిలో పారిశుద్ధ్య పనులు చేస్తున్న దృశ్యం



పోలేపల్లిలో పిచ్చిమొక్కలు తొలగిస్తున్న దృశ్యం

పోలేపల్లిలో..

దుర్గి: స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని పోలేపల్లిలో పిచ్చిమొక్కలు తొలగించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. నోడల్ ఆఫీసర్ ఏఓ శివప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో అంబారావు, స్వచ్ఛ భారత్ మండల కో–ఆర్డినేటర్ బి.బెంజిమెన్, అంగన్‌వాడీ టీచర్స్, ఏఎన్ఎంలు ద్వారా వీఏఓ, ప్రజలు పాల్గొన్నారు.

అందరికీ ఉపాధి పనులు కల్పించాలి

రెంటచింతల: జాబ్‌కార్డు కలిగి పని అడిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించాలని ఎంపీడీఓ యల్లా మహాలక్ష్మి చెప్పారు. బుధవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లతో ఆమె సమీక్ష నిర్వహించారు. మండలంలో 2024 –2025కు సంబంధించి ఉపాధిహామీ ద్వారా గుర్తించిన రూ.12 కోట్ల విలువైన 476 పనులకు ప్రభుత్వ అనుమతి లభించిందని పేర్కొన్నారు. పండ్ల తోటల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించాలని, నీటికుంటలను ఏర్పాటు చేసుకునే విధంగా ప్రోత్సహించాలని పేర్కొన్నారు. 11 గ్రామాల్లో ఇప్పటి వరకు 10,750 మందికి జాబ్ కార్డులు అందించినట్టు వివరించారు. సమావేశంలో ఏపీఓ జి.జయచంద్రకుమార్, ఎఫ్ఏలు రామాంజి, సామ్యానాయక్, మణి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఫీల్డ్‌అసిస్టెంట్లు సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ యల్లా మహాలక్ష్మి

ఆదినారాయణ బోధనా విధానం ఆదర్శం

మాచర్ల రూరల్: చిన్నారులకు అర్థమయ్యే రీతిలో లోకాస్ట్, నో కాస్ట్ విధానంతో విద్యా బోధన చేసి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు అందుకున్న ఎస్.ఆదినారాయణ ఆదర్శనీయులని హెచ్‌ఎం ఐవీ నాగమణి అన్నారు. బుధవారం కొప్పునూరు జెడ్పీ హైస్కూల్లో ఆదినారాయణకు సన్మానం చేశారు. అక్షరమాలను తానే పెయింటింగ్‌గా వేసి తెలుగు, గణితం చతుర్విధ ప్రక్రియలతో ఆహ్లాదకరంగా పాఠాలను బోధించిన ఆదినారాయణ మాస్టారు కృషిని ప్రశంసించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విశ్వనాథం, దస్రు, వెంకటేశ్వర్లు, హుస్సేన్, కావేరి అప్పారావు, రామ్మోహన్, యాసఫ్, మధుబాబు, అప్పారావు, శ్రీనివాసరావు, ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయుడు ఆదినారాయణను సన్మానిస్తున్న దృశ్యం

ఆధునిక విద్యాబోధనను అందిపుచ్చుకోవాలి

మాచర్ల రూరల్: ఆధునిక విద్యాబోధనను ఉపాధ్యాయులు అందిపుచ్చుకోవాలని మండల విద్యాశాఖాధికారి అల్లి సురేష్ కోరారు. బుధవారం మండలంలోని కంభంపాడు జెడ్పీ హైస్కూల్లో నిర్వహించిన కాంప్లెక్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు సులువైన రీతిలో బోధించాలని సూచించారు. హెచ్‌ఎం రామిరెడ్డి విజయకుమారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రిసోర్సు పర్సన్లు ఎస్‌పీఎస్ నాగరాజు, రమేష్, తిర్లిక శ్రీనివాసరావు, సైదమ్మ, ఉపాధ్యాయులు ప్రశాంతి, అనంతరామయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన డేవిడ్ విల్సన్, కొమ్ము కిషోర్‌ను సత్కరించారు.



మాట్లాడుతున్న ఎంఈఓ అల్లి సురేష్ చిత్రంలో హెచ్‌ఎం రామిరెడ్డి విజయకుమారి

21న ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

దుర్గి: ఈ నెల 21న వాసవి క్లబ్ దుర్గి, శాంతిరామ్ మెడికల్ కాలేజ్ అండ్ జనరల్ హాస్పిటల్, నంధ్యాల వారి ఆధ్వర్యంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు వాసవి క్లబ్ దుర్గి అధ్యక్షులు కాసుల ప్రసాద్ చెప్పారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ శిబిరాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైద్యపరీక్షల అనంతరం అవసరమైన వారికి శస్త్రచికిత్సలతోపాటు కళ్లజోళ్లు అందిస్తామని వివరించారు.

కిలో 250 గ్రాముల గంజాయి స్వాధీనం

ఇద్దరి అరెస్ట్

కారెంపూడి: గంజాయి కలిగి ఉన్న ఇద్దరిని అరెస్టు చేసి వారి వద్ద సరుకు స్వాధీనం చేసుకున్నట్టు కారెంపూడి సీఐ టీవీ శ్రీనివాసరావు బుధవారం సాయంత్రం విలేకరులకు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గంజాయి అమ్మకాలు జరుగుతున్నాయన్న విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ నేపథ్యంలో కాల్వ మహేష్ అనే వ్యక్తి వద్ద 250 గ్రాముల గంజాయి లభ్యమైంది. అతడిని అదుపులోకి తీసుకుని విచారణ చేయగా, తాను మాచర్లలో లక్ష్మీశివనాగమణి అనే మహిళ వద్ద కొన్నానని చెప్పాడు. దీంతో పోలీసులు ఆమెను కూడా అదుపులోకి తీసుకున్నారు. ఆమె వద్ద మరో కిలో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి గురజాల సివిల్ కోర్టుకు హాజరుపర్చారు. జడ్జి నిందితులకు రిమాండ్ విధించినట్టు సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

తెలంగాణ మద్యం పట్టివేత

మాచవరం: మండలంలోని శ్రీరుక్మిణీపురం గ్రామంలో అక్రమంగా విక్రయిస్తున్న తెలంగాణ మద్యాన్ని పట్టుకున్నట్లు ఎస్ఐ కె.సతీష్ తెలిపారు. గ్రామానికి చెందిన మెగావత్ బాలీబాయి మద్యం విక్రయిస్తున్నట్లు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు నిర్వహించగా ఆమె వద్ద నుంచి 36 తెలంగాణ మద్యం సీసాలు లభ్యమయ్యాయి. వాటిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపు

నకరికల్లు: మండలంలోని కుంకలగుంట గ్రామంలో సచివాలయం–1, రైతుభరోసా కేంద్రం ధ్వంసం కేసులో పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపు చర్యలు చేపడుతున్నట్లు రూరల్ సీఐ ఎం.రాంబాబు బుధవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈనెల 14వ తేదీన అర్ధరాత్రి కుంకలగుంట గ్రామంలో గల సచివాలయంలో ఎలక్ట్రికల్ సామగ్రి, కంప్యూటర్ పరికరాలు, ఫర్నీచర్, శిలాఫలకాలు ధ్వంసం చేసిన ఘటనలో ఐదుగురిని నిందితులుగా పోలీసులు గుర్తించారు. కార్యదర్శి సంజయ్‌కృష్ణ ఫిర్యాదు మేరకు వాచ్‌మెన్ లక్ష్మయ్య ద్వారా లభించిన ఆధారాలను సేకరించి దర్యాప్తులో భాగంగా ఐదుగురు నిందితుల్లోని జిడుగు నిరీక్షణరావు, ముసుకు ఏసురాజులను ఈనెల 15వ తేదీన అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచారు. మిగిలిన ముగ్గురు నిందితులైన బొడ్డు రామారావు, జిడుగు బిక్షయ్య, మువ్వా ఆంజనేయులును అరెస్ట్ చేయాల్సి ఉంది.

ఏటీఎం మోడల్‌తో రైతులకు నిరంతరం ఆదాయం

బెల్లంకొండ: ప్రకృతి వ్యవసాయ విధానంలో ఏటీఎం మోడల్ విధానాన్ని పాటించడం ద్వారా రైతులు నిరంతరం ఆదాయం పొందవచ్చని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.అమల కుమారి తెలిపారు. బుధవారం మండలంలోని నాగిరెడ్డిపాలెం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సిబ్బందితో కలసి ఆమె సందర్శించారు. ఆమె మాట్లాడుతూ ఏటీఎం మోడల్‌లో మొత్తం 27 రకాల కూరగాయలు, ఆకుకూరలు, దుంప జాతి, తీగజాతి, నూనె జాతి, పూలరకాల పంటలను ఒకే పొలంలో వేసి 365 రోజులు ఆదాయాన్ని పొందవచ్చన్నారు. భూములలో వివిధ రకాల పంటలు వేయటం వలన జీవవైవిధ్యం పెరిగి అధిక దిగుబడి వస్తుందన్నారు. అనంతరం గ్రామంలో వేసిన ఏ–గ్రేడ్ మోడల్ వరి పంటలను సందర్శించారు. రైతు సాధికార సంస్థ సీటీఎల్ ప్రవీణ్ కుమార్, శివరామకృష్ణ, అనంతలక్ష్మి, అంజలి, మహిళా రైతులు జ్యోతి, మాధవి పాల్గొన్నారు.



వ్యవసాయ ఉత్పత్తులను పరిశీలిస్తున్న డీపీఎం అమలకుమారి

నేటి నుంచి ఆటల పోటీలు ప్రారంభం



రెంటచింతల: గ్రామీణ ప్రాంతాలలోని ప్రతిభ కలిగిన క్రీడాకారులను గుర్తించేందుకు స్థానిక సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో గురువారం నుంచి 21వ తేదీ వరకు గ్రామ స్థాయి ఆటల పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహక కమిటీ మండల కో ఆర్డినేటర్ కత్తి రవి తెలిపారు. బుధవారం రెంటచింతలలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఆటల పోటీల ద్వారా గ్రామ స్థాయిలో వివిధ ఆటలలో క్రీడానైపుణ్యం కలిగిన వారిని ఎంపిక చేసి వారిని మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనేలా శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. సమావేశంలో పలువురు పీఈటీలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.